

పాఠశాల విద్యలో వెనుకబాటు : ఎంఎల్‌సి

కాళ్ల : కార్పొరేట్ విద్యా సంస్థల చదువులో మొదటి స్థానంలో ఉన్న ఎపిలో ప్రభుత్వ పాఠశాల విద్యలో వెనుకబడి ఉందని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రాగోపీమూర్తి అన్నారు. పెదఅమిరం మెయిన్ ప్రాథమిక పాఠశాల్లో వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాల వార్షికోత్సవ సభ కు హెచ్‌ఎం ప్రసన్న భారతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అయితే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారో ఆయా రాష్ట్రాలు విద్యలో మొదటి స్థానంలో సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి సమాజానికి ఉపయోగపడే భావి భారత పౌరులు వెళ్లుతున్నారని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. రైల్వే బోర్డు మెంబర్ కోరా రామ్మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పనితీరు చాలా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచి జవ్వాది కిషోర్, మాజీ సర్పంచి కఠారి పాల్గొన్నారు.

జెడ్‌పి నిధుల్లో వివక్ష ఎందుకు..!

తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి రూ.ఏడు కోట్లే కేటాయించారన్న బొలిశెట్టి

నిధులపై ఆచంట, వీరవాసరం జెడ్‌పిటిసిలు వైఎస్ చైర్మన్ మధ్య వాగ్వివాదం

జులైలో వరద పంట నష్టపరిహారం అందించాలన్న ఎంఎల్‌ఎ ఆరిమిల్లి

టిఆర్ 126 రకం ధాన్యం కొనుగోలు సమస్యలపై చర్చ

ఏజెన్సీలో తాగునీటి సమస్య పరిష్కరించాలన్న ఎంఎల్‌ఎ చిర్రి

తాగునీటి సమస్య లేకుండా చర్యలు ; జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

సమావేశానికి రాని అధికారులకు చర్యలకు చైర్‌పర్సన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ



నిధుల కేటాయింపుపై వాదులాడుకుంటున్న జెడ్‌పిటిసిలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ నిధుల కేటాయింపులో వివక్ష ఎందుకంటూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా చర్చ సాగింది. ఇటీవల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలోనూ దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ జెడ్‌పి నిధుల కేటాయింపులపై ప్రస్తావించడం మరోసారి చర్చకు దారి తీసింది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశం హాల్లో గురువారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు ఆరిమిల్లి రాధాకృష్ణ, చిర్రి బాలరాజు, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జెడ్‌పిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ప్రతి నియోజకవర్గానికీ రూ.25 కోట్లు కేటాయించారని, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి మాత్రం రూ.ఏడు కోట్లు మాత్రమే మంజూరు చేశారని, భవిష్యత్తులో జిల్లా పరిషత్తు మూడు జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలకూ సమానంగా నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. వీరవాసరం, ఆచంట జనసేన, టిడిపి జెడ్‌పిటిసిలు గుండా జయ ప్రకాష్‌నాయుడు, సురేష్ బాబు గత ప్రభుత్వంలో జెడ్‌పి నిధుల తమ మండలాలకు సరిగ్గా కేటాయించలేదంటూ ప్రస్తావించారు. దీంతో వైసిపి జెడ్‌పిటిసి, వైఎస్ చైర్మన్ పి.విజయబాబు గతంలో నిధులు కేటాయించారంటూ కాగితాలు చూపించేందుకు వెళ్లగా వారి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. కాగితాల్లో మాత్రమే చూపించారని నిధులు మాత్రం కేటాయించలేదంటూ జెడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ జులైలో కురిసిన అధిక వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇంకా జమ కాలేదని, వెంటనే జమయ్యేలా చూడాలని కోరారు. అధిక దిగుబడి అందించే టిఆర్ - 126 ధాన్యం రకం సాగుపై రైతులకు అవగాహన కలిగించి, ఆ ధాన్యాన్ని ధాన్యం ఆరబెట్టే డ్రయ్యర్లు కలిగిన మిల్లులకు నేరుగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం ఏజెన్సీ ఏరియాలో ఏడు మండలాలు 121 గ్రామాలు ఉన్నాయన్నారు. ఓహెచ్ ఆర్‌ఎస్ మంజూరైనా పనులు మొదలు కాక తాగునీటికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలకు 18 నెలలుగా రావాల్సిన గౌరవవేతనం బకాయిలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తణుకు సమీపంలో పశువుల మాంసం కేంద్రం కారణంగా పర్యావరణానికి విఘాతం కలుగుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాల తెలిపారు. తాగునీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలంటూ ఎంఎల్‌ఎలు, జెడ్‌పిటిసి సమావేశంలో అత్యధికంగా ప్రస్తావించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ భీమేశ్వరరావు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్లు టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎస్.చిన్నరాముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై పటిష్ట చర్యలు : జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో కృష్ణా, గోదావరి కాలువలను కట్టివేసే తేదీని ఈ నెల 22వ తేదీ వరకూ పొడిగించినందున, ఈలోగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని తాగునీటి నీటి వనరులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని, కాల్వల ద్వారా శివారు ప్రాంతాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా బోర్లు ఏర్పాటు చేయాలని, మరమ్మతులకు గురైన బోర్లకు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. మండలంలో చేపట్టే ప్రభుత్వ అధికారిక అభివృద్ధి పనులు ప్రోటోకాల్ ప్రకారం జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఇతర ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని లేకపోతే చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని చైర్మన్ గంటా పద్మశ్రీ జెడ్‌పి సిఇఒను ఆదేశించారు.

తూతూమంత్రంగా స్థాయి సంఘాల సమావేశాలు

జెడ్‌పిలో ఏడు స్థాయి సంఘాలు ఉంటాయి. ఈ సమావేశాలు విడిగా జరపకుండా గతానికంటే భిన్నంగా సమావేశం హాల్లోనే గంపగుత్తగా సాగించేశారు. దీంతో స్థాయి సంఘాల సమావేశాలు తూతూమంత్రంగా ముగిశాయి. అధికారులు అంకెలు వల్లిస్తూ ముగించేశారు. జెడ్‌పిసిటిల ప్రతిస్పందన పెద్దగా లేకుండానే ముగిసిపోయాయి. విడిగా నిర్వహించాల్సిన స్థాయి సంఘాల సమావేశాలు ఇలాగేనా నిర్వహించడం నిర్వహించడం అన్న చర్చ సాగింది.

ఓటరు నమోదులో చేర్పులు, మార్పులపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఓటరు నమోదులో చేర్పులు, మార్పులు క్లెయిమ్స్ పరిష్కార ప్రక్రియను తప్పులేకుండా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై క్లెయిమ్స్ పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మరపట్ల శ్యాంబాబు మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల నమోదులో డబుల్ ఎంట్రీలు నమోదయ్యాయని, వాటిని సవరణ చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఆరు నెలల డేటాను పరిశీలించి ఇంకా ఎవరైనా డబుల్ ఎంట్రీలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 14 లక్షల 70 వేల 886 మంది ఉన్నారన్నారు. వారిలో పురుషులు 7 లక్షల 20 వేల 613 మంది, మహిళలు 7 లక్షల 50 వేల 197 మంది, ట్రాన్స్ జెండర్స్ 77 మంది ఉన్నారన్నారు. ఫారం -6 ఓటు నమోదుకు 906 మంది దరఖాస్తు చేసుకోగా 741 పరిష్కరించినట్లు తెలిపారు. ఇంకా 73 పెండింగ్‌లో ఉన్నాయని, 92 తిరస్కరించడం జరిగిందని తెలిపారు. ఫారం-7 ఓటు తొలగింపునకు 703 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. ఫారం -8 మార్పులు, చేర్పులకు 2,491 క్లెయిమ్స్‌కు గాను 2,135 పరిష్కరించగా 125 తిరస్కరించడం జరిగిందని ఇంకా 232 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎలక్షన్ సూపరింటెండెంట్ మద్రావు సన్యాసిరావు, జనసేన నాయకులు యు.చంద్రశేఖర్, జె.శివ, వైసిపి నాయకులు కామన నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు ఎం.రామాంజనేయులు, బిఎస్‌పి నాయకులు ఎం.రత్నరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



బొండాడలో జెసిబి పేదల ఇళ్లను కూల్చి వేస్తున్న

పేదల ఇళ్లు కూల్చివేత

పోలీసు బందోబస్తు నడుమ తొలగింపు

బొండాడలో ఉద్రిక్తత

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

బాధితులు, సిపిఎం మండల కార్యదర్శి రామకృష్ణ అరెస్ట్, విడుదల



బాధితులను లాక్కెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కాళ్ల

పెద్దల ఇళ్ల వదిలేసి పేదల ఇళ్లను కూల్చేయడంతో మండలంలోని బొండాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బొండాడ మెయిన్ రోడ్డులో పేదలకు చెందిన 20 ఇళ్లను పంచాయతీ అధికారులు, పోలీస్ బందోబస్తుతో గురువారం కూల్చివేశారు. అయితే రోడ్డు మార్జిన్లో మార్కింగ్ ఇచ్చిన పెద్దలకు సంబంధించిన 80 ఇళ్ల తొలగించలేదు. ఈ నేపథ్యంలో పంచాయతీ, పోలీస్ అధికారుల తీరును నిరసిస్తూ మూడున్నర గంటల పాటు బాధితులు నిరసన తెలిపారు. పోలీసు బందోబస్తు నడుమ పంచాయతీ, పోలీసులు ఇళ్లను కూల్చేందుకు జెసిబి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో బాధితులు, సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ జెసిబిని అడ్డుకున్నారు. అయితే ఎంఎల్‌ఎ రఘు రామకృష్ణంరాజు నుంచి ఆదేశాలు రావడంతో ఆకివీడు సర్కిల్ సిఐ జగదీశ్వరరావు, ఆకివీడు, ఉండి, కాళ్ల, భీమవరం రూరల్ ఎస్‌ఐలు బాధితులను, మహిళలను, సిపిఎం నాయకుడు గొర్ల రామకృష్ణను అరెస్టు చేసి కాళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఇళ్లను తొలగించారు. మహిళలని చూడకుండా దౌర్జన్యంగా అరెస్టు చేయడం అన్యాయమని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. బొండాడలో తొలగించిన ఇళ్లకు ఆనుకుని ఇరిగేషన్ పోరంబోకు స్థలం 79 సెంట్లు ఉందని, ఆ స్థలంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయం చూపాలి..

కూలీ నాలీ చేసుకుని జీవించే తమ ఇళ్లను కూల్చి నడిరోడ్డు మీద వదిలేశారని, తాము ఎలా బతకాలని, ఎక్కడికెళ్లాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమలో కొంత మందికి పశువులకు కూడా కనీసం నివాసయోగ్యం కాని లక్ష్మీ నరసింహపురం గ్రామంలో పట్టాలు ఇచ్చారని, వాటిని రద్దుచేసి బొండాడలోని ప్రభుత్వ పోరంబోకు స్థలంలో పట్టాలు ఇవ్వాలని కోరారు. కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన..

అరెస్ట్ చేసిన సిపిఎం నాయకుడు రామకృష్ణను, మరికొంత మందిని విడుదల చేయాలని బాధితులు కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. కొంత సమయం తరువాత వారిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కట్టా కిట్టయ్య, కట్టా సత్యవతి, పల్లమ్మ, కందులు బాలాజీ, లీలా కుమారి, కందుల నాగమణి, ఆరేపల్లి సత్యవతి, ఆరేపల్లి రమేష్, కట్టా భవాని, కట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

సిపిఎం ఆధ్వర్యాన బాధితుల నిరసన ప్రదర్శన



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, బాధితులు

ప్రజాశక్తి - మొగల్తూరు

వ్యాన్ దూసుకెళ్లిన ఘటనలో మృతి చెందిన, గాయపడిన ఉపాధి హామీ కూలీల కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నల్లంవారితోటలో ఉపాధి పనిలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన, గాయపడిన ఉపాధి కూలీల కుటుంబ సభ్యులను గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిపిఎం భీమవరం మండల కన్వీనర్ ఇంజెటి శ్రీనివాస్‌లతో కలిసి గోపాలన్ పరామర్శించారు. అనంతరం మొగల్తూరు రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో వెంటనే ప్రకటించాలన్నారు. సంఘటన జరిగి 24 గంటలైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఒకే కుటుంబంలో భార్యాభర్తలు, మరో మహిళ మృత్యువాత పడడం బాధాకరం అన్నారు. గుడాల సత్యనారాయణ మెరుగైన చికిత్స కోసం భీమవరం పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకూ ప్రభుత్వ సాయం అందకపోవడం దారుణమన్నారు. ఉపాధి పనిచేస్తుండగా ప్రమాదం జరిగితే రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో రూ.10 లక్షలు, గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.5 లక్షలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాలన్నీ ఇప్పటికే జిల్లా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన కుటుంబ సభ్యులకు, ఇతర చోట్ల ఎక్కడ జరిగిన ప్రభుత్వం వెంటనే స్పందించి ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తోందని, కానీ వీరిపట్ల ప్రకటించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఆయా కుటుంబాల్లో చదువుకున్న కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఇప్పటివరకూ బాధ్యత కుటుంబ సభ్యులు వైద్య నిమిత్తం వెచ్చించిన నిధులను ప్రభుత్వ పరంగా చెల్లించి ఆదుకోవాలని, లేనిపక్షంలో వ్యకాస ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బాధిత కుటుంబ సభ్యుల సమస్యలను ఆర్‌డిఒ దాసి రాజు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆర్‌డిఒ సానుకూలంగా స్పందించి బాధిత కుటుంబాల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో బాధితుల కుటుంబ సభ్యులు పిల్లి కృష్ణమూర్తి, దొంగ సత్యనారాయణ, గుడాల సత్యనారాయణ, కముజు నాగ శ్రీనివాస్, కడలి నరసింహారావు, వేంద్ర శ్రీనివాస్, గుత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ సమస్యలు వివరిస్తున్న గోపాలన్, సత్యనారాయణ

సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా




ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, యూనియన్ అధ్యక్షులు యు.శ్రీనివాసరావు, కార్యదర్శి జి.విజయకుమార్ మాట్లాడుతూ మున్సిపాల్టీలో గత 20 సంవత్సరాలుగా ఇంజినీరింగ్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. గడిచిన 20 సంవత్సరాల కాలంలో 4 ప్రభుత్వాలు మారినా ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచలేదని తెలిపారు. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తున్న తక్కువ వేతనాలతో బతకడం చాలా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 36 ప్రకారం వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ పెంచడం లేదన్నారు. అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినా అధికారుల నుంచి గానీ, ప్రభుత్వం నుంచి గానీ స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.ఆదినారాయణ బాబు, దాసరి సత్యనారాయణ, పిండి పెద్దరాజు, గుడాల నాగబాబు, పాపారావు, రావి శ్రీను, నాగరాజు, పవన్ రాజేష్, సత్యానందం శ్రీదేవి పాల్గొన్నారు.

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంత వాసుల వినతి



శ్రీనివాసరావుకు వినతిని అందజేస్తున్న బాధితులు

పాలకోడేరు : ఇటీవల భీమవరం వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు మొగల్లు సుబ్బరాజు చెరువుగట్టు ప్రాంతవాసులు సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ చెరువుగట్టునే నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామని, అయితే ఎవరికి ఎటువంటి అడ్డు లేకపోయినప్పటికీ తమ గృహాలను తొలగించేందుకు అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. కనీసం ప్రత్యామ్నాయం కూడా చూపించకుండా ఉన్నట్టుండి ఇల్లు ఖాళీ చేయమని చెబితే ఎక్కడికి వెళ్లి ఎలా బతకాలి అంటూ సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంతవాసులు వాపోయారు. తమ 23 కుటుంబాలకు మీరే న్యాయం చేయాలంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఉన్నట్టుండి నిర్ధాక్షణంగా ఇల్లు తొలగిస్తామనడం సరైంది కాదన్నారు. ప్రత్యామ్నాయం చూపించకుండా ఏవిధంగా ఇల్లు ఖాళీ చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ జాగాల్లో నివాసముంటున్న వారికి పట్టాలిస్తామని గతంలో ప్రభుత్వం చెప్పిందని ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. మొగల్లు సుబ్బరాజు గట్టు ప్రాంత వాసుల సమస్యలతో పాటు మిగిలిన ప్రాంతాల్లో కూడా ఏర్పడినటువంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ్య ఉన్నారు.

'ఆయుష్మాన్' కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వైద్య ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విభాగంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, సిహెచ్‌ఒలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో పనిచేయుచున్నారు. వీరికి జీతభత్యాలు ప్రతినెల సరిగా అందక కుటుంబాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గతంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కి వినతిపత్రం సమర్పించారు. గురువారం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎన్‌జిఒ యూనిట్ అధ్యక్షులు గుడాల హరిబాబుకి వినతి పత్రం సమర్పించి తమ సమస్యల పరిష్కరించుటకు సహకరించాలని కోరారు. సిహెచ్‌ఒలుగా పనిచేస్తున్న తమకు గత 2 సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని, అలాగే ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించి 23శాతం జీతం పెంచాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను సవరించాలని, ఇపిఎఫ్‌ఒ పునరుద్ధరించి క్లీనిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకునే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని లంకలకోడేరు పిహెచ్‌సి కన్వీనర్ గౌతమి తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంతి, సుజిత, రాజశ్రీ, యువతేజ, స్రవంతి, కృష్ణవేణి, లిఖిత, శైలజ, శిరీష, అన్న ప్రైస్, శ్రావణి, మార్త పాల్గొన్నారు.

పెనుమంత్ర : గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్, ఆరోగ్య మందిర్‌లో గత రెండు సంవత్సరాల పైబడి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తమకు గత రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో అనేకమైన సమస్యలను ఎదుర్కొంటున్నామని ఎపిఎండిసికి యూనియన్ జిల్లా జాయింట్ ట్రెజర్ సత్య స్వరూప ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పెనుమంత్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వారంతా ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ముఖేష్, శ్రీనివాసు, రేవతి రెడ్డి, ఇందిర, ఉదయ్, స్వాతి, కుమారి, మోహన్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి'

ప్రజాశక్తి - గణపవరం

తల్లిదండ్రులు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పాఠశాలలను బలోపేతం చేయాలని గణపవరం ఎంఇఒ జి.బాలయ్య అన్నారు. గురువారం పిప్పరలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజుల ఇబ్బందులు ఉండవని, కనీసం అడ్మిషన్ ఫీజు కూడా చెల్లించనవసరం లేదని చెప్పారు. ప్రతి విద్యార్థికి యూనిఫారం, పుస్తకాలు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు కావలసిన యోగ, వ్యాయామం, ఆటలు ప్రోత్సాహం ఇస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం అందరికీ అందజేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా ఇంగ్లీషు మీడియం క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ర్యాలీ ప్రధాన రహదారులలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం పి.జయ వెంకటేశ్వర్లు, స్థానిక పెద్దలు పివి.నరశింహరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచంట : ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి అభివృద్ధికి బాటలు వేయాలని ఎంఇఒ-1 ఎ.ఉషారాణి అన్నారు. గురువారం పెనుమంచిలి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమంపై ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడి బయట పిల్లలు లేని గ్రామంగా తీర్చిదిద్దడమే బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడం గ్రామ వాలంటర్లీ సహాయంతో ఆ పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. స్టూడెంట్ కిట్లు, ఇతర విద్యాప్రోత్సకాలు అందిస్తామన్నారు. నూతనంగా బడిలోకి చేరిన పిల్లల సామర్థ్యాలు, వయసుకు తగిన తరగతులోకి చేర్చి ఆ తరగతిస్థాయిని అందుకునేందుకు బ్రిడ్జి కోర్సులను అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్ దేవదాసు, జి.లక్ష్మీనారాయణ, కెకె.రాజు, సిహెచ్.చిన్న శ్రీనివాసరావు, జివిఎస్.లక్ష్మి, జి.సుజాత, రామకృష్ణ, కాలేదార్, సురేష్, ఎస్‌ఎంసి ఛైర్మన్ నాగరాజు, బిందు పాల్గొన్నారు.

మహిళలకు సమాజంలో రక్షణ లేదు

సామాజిక చైతన్య యాత్ర ముగింపులో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

నరసాపురం : సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు ఈ సమాజంలో రక్షణ కరువైందని, మహిళల హక్కుల కోసం ఎన్ని పోరాటాలు చేసినా సాధించుకోవడంలో విఫలమయ్యారని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సామాజిక న్యాయాన్ని సాధిద్దాం సామాజిక చైతన్య యాత్ర నాలుగు రోజులపాటు జిల్లాలో ప్రతి గ్రామంలోనూ, పట్టణంలోనూ ప్రచార కార్యక్రమం నిర్వహించింది. గురువారం నరసాపురంలో ముగింపు సభ జరుపుకుంది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చి దళిత మహిళల హక్కుల కోసం, పేద మధ్యతరగతి మహిళల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఐద్వా కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, రక్షణ కల్పించాలని, దానికోసం ఐద్వా నిరంతరం పనిచేస్తుందని ఆమె అన్నారు. ఈ ప్రచార యాత్ర భీమవరం, తణుకు, యలమంచిలి, ఆకివీడు, పెనుమంత్ర మండలం తాడేపల్లిగూడెం మీదుగా నరసాపురం చేరుకుని అక్కడ ముగింపు జరుపుకుంది. ఈ కార్యక్రమంలో కోరాడి పార్వతి, లక్ష్మీ, సూర్యుడు, చంద్రుడు, తదితర మహిళలు పాల్గొన్నారు.

రక్తదానం ఎదుటివారికి ప్రాణదానం : డిపిఒ అరుణశ్రీ


భీమవరంటౌన్ : రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

భీమవరం టౌన్ : రక్తదానం చేయటం వల్ల ఎదుటివారికి ప్రాణదానం చేసినట్లేనని, అలాగే రక్తదానం చేసిన వారు మరింత ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పంచాయతీ శాఖ అధికారి అరుణశ్రీ అన్నారు. జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. రాయలం పంచాయతీ పరిధిలో ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని డిపిఒ ప్రారంభించారు. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం మండలాల్లో 90 యూనిట్లు రక్తదానం చేశారు. సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్తం పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. కొవ్వాడ అన్నవరం గ్రామ కార్యదర్శి శ్యామ్ రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ కృష్ణంరాజు, ఇఒపిఆర్‌డి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, రమాలీలు, పద్మారావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: పాలకొల్లు మండలం ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆదేశాల ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేయుచున్న ఉద్యోగులు రక్తదానం చేశారు. బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లో పాలకొల్లు ఎంపిడిఒ ఎస్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పాల శ్రీనివాస్, పాలకొల్లు మండల సెక్రటరీల అధ్యక్షుడు బంగారు శివరామకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ, మురళీ బాబు పాల్గొన్నారు.

అవగాహన, అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

నరసాపురం : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు గురువారం నరసాపురం కేంద్ర అగ్నిమాపక సిబ్బంది పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలోని విద్యార్థులకు, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంట్లో ఎల్‌పిజి గ్యాస్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షార్ట్‌సర్క్యూట్ జరిగినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు, డెమో ద్వారా ఎల్‌పిజి గ్యాస్ లీక్ ద్వారా ఏర్పడే మంటలను ఎలా అదుపు చేయాలో చూపించారు. అగ్నిప్రమాదాలలో వివిధ రకాల అంశాల గురించి వివరించి అవి జరిగితే తీసుకునే చర్యలను వివరించారు పాంప్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం కేంద్ర అగ్నిమాపక అధికారి కె.ఖాన్యకుమార్ రామమ్, సిబ్బంది సెయింట్ ఆన్స్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. **పాలకొల్లు :** అగ్నిమాపక వారోత్సవాల నాలుగవ రోజు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో భారతీయ విద్యాభవన్ గ్రీన్ ఫీల్డ్ స్కూల్లో విద్యార్థులకు, సిబ్బందికి సమావేశ పరిచి అగ్నిమాపక వారోత్సవాల ఉద్దేశ్యాలను వివరించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు గృహంలో ఎల్‌పిజి వాడటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ గ్రీన్ ఫీల్డ్ స్కూల్ డైరెక్టర్ ఎంఎస్ఎన్.మూర్తి, ప్రిన్సిపల్ బి.మహేశ్వరి, సిబ్బంది, విద్యార్థులు, అగ్నిమాపక జిల్లా సహాయధికారి వై.వి.జానకీరామ్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా విభాగం పరిశీలన

నరసాపురం: పట్టణంలోని 2వ వార్డు శ్రీహరిపేటలోని ప్రధానమంత్రి రక్షిత మంచినీటి సరఫరా విభాగాన్ని గురువారం నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. మంచినీటి సరఫరా ప్రాంగణం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలని తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఆలం, క్లోరిన్ నిల్వలను, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరికీ నీటిని చాలా పొదుపుగా, జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. రక్షిత మంచినీటి సరఫరా చేసే సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఇ ప్రవీణ్ చంద్ర, ఎఇ కిషోర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్ టిఎస్‌ఒలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

భీమవరం టౌన్ : ప్రతిభావంతులను ప్రోత్సహించి అన్ని రంగాల్లోనూ రాణిస్తారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఐఎన్ టిఎస్‌ఒ గ్రాండ్ ఫైనల్‌లో ప్రతిభ కనబరిచిన భీమవరం శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులను ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎంఎల్ఎ అంజిబాబు అభినందించారు. నూకల జయసాయి మణికంఠ(7వ తరగతి), షేక్ తస్మిమ్ కౌసర్(9వ తరగతి), అడ్డాల సూర్యనందన్(3వ తరగతి) ఐఎన్ టిఎస్‌ఒలో మెరిట్ బహుమతి సాధించారు. వీరికి ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా ల్యాప్‌టాప్, ట్యాబ్స్, గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎస్ వి కృష్ణంరాజు, ఇన్‌ఛార్జి పి.సుబ్బారాయుడు, ఎకడమిక్ డీన్ టి.వేణుగోపాల్, ప్రైమరీ ఇన్‌ఛార్జి దుర్గాభవాని, పి.రాజు, డి.మౌనిక, రాయలం ఉపాధ్యాయులు శ్రీకృష్ణ పాల్గొన్నారు.

దేవలో అన్నసమారాధన

పెనుగొండ : అంబేద్కర్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు నడిపించాలని, ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలని దేవ సర్పంచి నల్లూరి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ దళిత కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

జిఎస్‌టి పేరుతో పురపాలక ఆదాయానికి గండి

నరసాపురం : పురపాలక ఆదాయానికి అధికారులే గండికొడుతున్నారు. జిఎస్‌టి పేరుతో పాట పెరగకుండా పాటదారులకు భయపెట్టడం వల్లే మార్కెట్ పాట గతం కంటే తక్కువగా వెళ్లిందని వైసిపి కొత్తపల్లి నాని, కౌన్సిలర్ సమ్మిటర్ వైకుంఠ్, స్వతంత్ర సభ్యులు కోటిపల్లి సురేష్ లు మండిపడ్డారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాలులో ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విని కొత్తపల్లి నాని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మార్కెట్ పాట ఇంత తక్కువకు వెళ్లడం వల్ల ప్రధమమని, అధికారుల నిర్లక్ష్యం వల్లే పాట ముందుకు సాగలేదు. జరిగిన పాటను కౌన్సిల్ ఆమోదిస్తే అది సభ్యులపై పడుతుందని, మరోసారి పాటను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పాటను కౌన్సిల్ ఆమోదించే కంటే ప్రభుత్వ పరిశీలనకు పంపించాలని కమిషనర్ అంజయ్యను కోరారు. మార్కెట్ పాటపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కౌన్సిల్ కట్టుబడి ఉంటుందని చైర్‌పర్సన్‌కు తెలియజేశారు. దీనికి వైసి బొంతు రాజశేఖర్ సభ్యుల నిర్ణయానికి అనుగుణంగా తీర్మానం చేయాలని అధికారులను కోరారు.

పంట బోదె ప్రక్షాళన

మొగల్తూరు : మండలంలోని కొత్త కాయ తిప్ప గ్రామంలో పంట బోదె ప్రక్షాళన పనులను గ్రామస్తులు స్వచ్ఛందంగా గురువారం చేపట్టారు. జంగిల్ పాదుల్ నుంచి గ్రామ కరుకు ఉన్న పంట బోదె గత ఐదు సంవత్సరాలుగా ప్రక్షాళన చేయడం లేదు ఉపాధి హామీ పథకంలో మా పరిధిలోకి వస్తుందని పనులేదని గ్రామస్తులు గతంలో అభ్యంతరం తెలిపారు. ఈ గ్రామస్తులు ప్రక్షాళన చేస్తుండటం ముందుకు రావడంలేదని ఉపాధి కూలీలు ప్రక్షాళన చేయకుండా అడ్డుకుంటున్నారని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాత అవకాశాలు లేక గ్రామాభివృద్ధి నిధులను వెచ్చించి బోదె ప్రక్షాళన చేస్తున్నామని గ్రామస్తులు తెలిపారు.

సివివి దంపతులకు సత్కారం

పాలకొల్లు : పద్య, సాహిత్య, కళ రంగాలలో సివివి సత్యనారాయణమూర్తి ప్రత్యేక ప్రతిభను చూపుతుండంకాయని పలువురు వక్తలు అన్నారు. కెవిఎం ఎన్నారై జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సివివి.సత్యనారాయణ మూర్తి రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం అందుకున్న సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గురువారం పాల్గొన్న డాక్టర్ కలిదిండి సీపీనర్ వర్మ అధ్యక్షతన జరిగిన సత్కార సభలో ప్రశంసించారు.

సురక్షిత నీరందించేందుకు చర్యలు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

పాలకోడేరు : పెన్నాడ అగ్రహారం గ్రామస్తులకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. నాగుల చెరువు ఆనుకుని ఉన్న ఆక్వా చెరువుల వల్ల మంచినీటి చెరువు కలుషితం అవుతుందని సర్పంచి చిల్లా అనూష, కూటమి నేతలు ఇటీవల డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీనిలో భాగంగా గురువారం రఘురామకృష్ణరాజు నాగుల చెరువు, దీన్ని ఆనుకుని ఉన్న ఆక్వా చెరువులు, పంట కాలువ, మురుగు బోదెలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి చిల్లా అనూష, గ్రామస్తులు, కూటమి నేతలు అనేక సమస్యలను రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ, ఎండోమెంట్, ఆర్డబ్ల్యుఎస్, మత్స్య శాఖ అధికారులను రఘురామకృష్ణరాజు పిలిపించి సమస్యలపై మాట్లాడారు. ఆక్వా చెరువుల వల్ల మంచినీటి చెరువు పాడవకుండా ఆదిగా తీసుకోవాలని సూచించారు. నాగుల చెరువు నీరు కలుషితమవుతున్నదని సర్పంచి, కూటమి నేతలు తనతో చెప్పారని ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులతో చర్చించామన్నారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఈయన వెంట సర్పంచి అనూష, ఆర్డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాస్, ఇరిగేషన్ డిఇ వెంకటేశ్వరరావు, ఎపిడిఒ లావణ్య, తహశీల్దార్ ఎపి.విజయలక్ష్మి, ఎంపిడిఒ వి.రెడ్డయ్య, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు, గ్రామ కూటమి నాయకులు చేబోలు రామకృష్ణ ఉన్నారు.

పేదల ఇళ్ల తొలగింపు అన్యాయం

ఖండించిన సిపిఎం జిల్లా కమిటీ

భీమవరం : కాళ్ల మండలం బండాడలో పేదల ఇళ్లను అక్రమంగా తొలగించడం అన్యాయమని, బాధితుల పక్షాన న్యాయంగా పోరాడుతున్న సిపిఎం నాయకులు గొర్ల రామకృష్ణను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. ఈమేరకు జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొండాడలో జరిగిన ఘటన, సిపిఎం నేత రామకృష్ణ అరెస్టును సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మూడున్నర గంటలపాటు ఉద్రిక్త వాతావరణం మధ్య 28 ఇళ్లను పంచాయతీ అధికారులు, పోలీసులు బందోబస్తుతో జెసిబి సాయంతో ఇళ్లను తొలగించడం అన్యాయం అన్నారు. జెసిబిని అడ్డుకున్న సిపిఎం మండల కార్యదర్శి రామకృష్ణను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్టు చేసిన బాధితులను, సిపిఎం నాయకుడు రామకృష్ణను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. పేదలకు ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండా బుల్డోజర్లతో ఇళ్లను తొలగించడం అన్యాయమని, తొలగించిన పేదలందరికీ ప్రత్యామ్నాయం చూపాలని, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు.

దళిత శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలి

ఆచంట : నియోజకవర్గంలో దళితుల శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. దళితుల శ్మశానవాటికలు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ ఆచంట తహశీల్దార్ జి.కనకరాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, కుసుమే వెంకటేశ్వరరావు, గోసంగి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

పలుచోట్ల చలివేంద్రం ప్రారంభం

తణుకు రూరల్: సోషల్ సర్వీస్ టీం ఆధ్వర్యంలో గురువారం స్థానిక దువ్వ గ్రామంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ మల్లెల డేవిడ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సిర్రా ధనరాజు, పెనుమాక అశోక్, కొడమంచిలి కోటి, కొడమంచిలి వెంకట్రాజు, బాదంపూడి శ్రీను, సనమండ్ర వెంకటేశ్వరరావు, నీలం ఆనంద్, తాళాల రామకృష్ణ, సిర్రా రీష్మ, రాచర్ల ప్రకాష్, నూతంగి రమేష్, చాట్ల కిషోర్, చాట్ల రమేష్, సిర్రా రాజేంద్ర, నాలికిమెల్లి ప్రభాకర్ పాల్గొన్నారు. **ఆకివీడు :** ఆకివీడు రైల్వే స్టేషన్ రోడ్‌లో టిడిపి నాయకులు గంధం ఉమా సత్యనారాయణ దాతృత్వంతో చలివేంద్రం ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్ ప్రారంభించారు. వేసవికాలం అంతా పూర్తిగా ఇక్కడ మజ్జిగ దాహార్తిని తీరుస్తామని నిర్వాహకులు ఉమా సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన బొల్లా వెంకట్రావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బీచ్‌లో తగు ఏర్పాట్లు చేయాలి : ఆర్‌డిఒ

మొగల్తూరు : మాల విరమణకు వచ్చే క్రైస్తవ సోదరులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేపీపాలెం బీచ్‌లో ఉన్న సాగర తార వేలంకని మాత ఆలయానికి వచ్చే క్రైస్తవ సోదరులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకూడదన్నారు. క్రైస్తవ సోదరులు గత 40 రోజులుగా ఉపవాస దీక్షలు చేసి మాల విరమణకు బీచ్‌లోని సముద్ర కెరటాలలో స్నానాలు హాచరిస్తారన్నారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి శ్రీవేద అరవింద్ ఆధ్వర్యంలో 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో శిక్షణ డిఎస్‌పి కె.మానస, తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, ఎస్ఐ జి.వాసు, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, మేళం బన్ను ఉన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన జల్లికాకినాడలో ధర్నా

గణపవరం : పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని గురువారం సిపిఎం ఆధ్వర్యాన జల్లికాకినాడలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ మండల కార్యదర్శి పెచ్చేట్టి నరశింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచటం వల్ల సామాన్య, మధ్యతరగతికి చెందిన ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉచిత గ్యాస్ ఇచ్చిన ఫలితం కనపడటం లేదని అన్నారు. మాటమాటికి ప్రభుత్వాలు గ్యాస్ ధర పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేయటం దారుణమని,వెంటనే పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పివిఆర్.సుబ్రమణ్యం, సోడదాసి సంజివిరావు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబాలను ఆదుకుంటాం'

మొగల్తూరు : బాధిత కుటుంబాలను ఆదుకుంటామని విప్ బొమ్మిడి నాయకర్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ కుమార్ అన్నారు. మొగల్తూరు పంచాయతీ సుబ్రహ్మణ్యేశ్వరం(నక్కవారి పాలెం) గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులను గురువారం రాత్రి కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కడలి పావని, గుబ్బల గంగాదేవి, గుబ్బల మాణిక్యాలరావు ఉపాధి హామీ చట్టంలో కాల్వలో పూడిక తీత పనిచేస్తూ టాటా అల్ట్రా వాహనం ఢీకొని మృతిచెందారు. మృతులకు రూ.50 వేలు మాత్రమే ఎక్స్‌గ్రేషియా అందజేశారు. దీనిని రెండు లక్షలకు పెంచారు. షణ్ముఖ కుమార్, నాయకర్ చేతుల మీదుగా వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల చెక్కులను అందజేశారు. కడలి పావని ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం నమోదు చేసుకున్నందున రెండు లక్షలు, మరో రెండు లక్షలు మొత్తం నాలుగు లక్షల రూపాయలు వస్తాయన్నారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్.అప్పారావు, ఆర్‌డిఒ దాసిరాజు, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూల పాణి ఉన్నారు.

జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డివైఇఒ విచారణ

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డివైఇఒ ఎన్.రమేష్ గురువారం విచారణ చేశారు. పాఠశాల హెచ్‌ఎం పి.రామరాజు విద్యార్థుల వద్ద నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేశారని విద్యార్థుల తల్లిదండ్రులు దొంగ సాంబమూర్తి, కె.సంధ్యారాణి, పి.సోమరాజు, పి.నారాయణ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు డివైఇఒ విచారించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ అన్నారు. మొగల్తూరు పంచాయతీ పాలకమ్మ చెరువు అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహనా సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచి పాల్గొని మాట్లాడారు. చిన్నారులలో ఆకలి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారం గురించి రక్తహీనత వల్ల కలిగే అనర్థాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జి.పెద్దింట్లు, హెల్త్ అసిస్టెంట్ కుక్కల సాంబశివరావు, ఎఎన్ఎం ఎంవి.శాంతకుమారి, సిహెచ్ఒ విరాజిత, ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.విజయ కుమారి, జిఎంఎస్ కె.భార్గవిశ్రీ ఉన్నారు. **గణపవరం :** పిల్లల పోషణ పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ప్రియాంక అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా గురువారం పిప్పరలో ఎస్ఎఎం, ఎంఎఎం పిల్లలకు ఆకలి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభవాని మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనంలోనే ఆరోగ్యమైన ఆహారపు అలవాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్.అన్నకుమారి, ఎంపిహెచ్ఒ వెంకటేశ్వరరావు, ఎఎన్ఎం ఏసుమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలుచోట్ల 'పోషణ్ పక్వాడా'

ఆచంట : నవజాతి శిశువు సంరక్షణ, బాలింతల పోషణపై అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా ఎదగాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంపై మండల స్థాయి పక్షోత్సవాలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పెనుమంట్ర సిడిపిఒ ఎ.కృష్ణకుమారి బాలింతల ఆరోగ్యం పట్ల పూర్తిగా శ్రద్ధ తీసుకొని పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో పుట్టే విధంగా సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పూర్ణ బాబ్జి, ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపిపిలు ఎర్రగుప్పల నాగరాజు, తాళం శ్రీనివాసరావు, ఎంపిటిసిలు సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, ఇఒపిఆర్‌డి జి.నరసింహారావు, ఆరోగ్యశాఖ అధికారులు, అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : పోషణ పక్షోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా గురువారం అంగన్వాడీ కేంద్రాల్లో గుర్తించిన పోషణ లోపం గల పిల్లలకు ఆలమూరు, మార్టేరు, పెనుమంట్ర పిహెచ్‌సిలలో ఆరోగ్య, ఆకలి పరీక్షలు నిర్వహించారని పెనుమంట్ర ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంల ఆలమూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్, పెనుమంట్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.కనకప్రియ, మార్టేరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.మల్లిక పాల్గొన్నారు.

ఇంటర్‌లో పిఎంసి విద్యార్థుల ప్రభంజనం

విద్యార్థులను అభినందించిన కళాశాల పాలకవర్గం

ప్రజాశక్తి - పాలకోడేరు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఆధ్యాపకులు పాలకవర్గం సభ్యులు

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో పాలకోడేరులోని పిఎంసి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ సెకండియర్ ఎంపిసి ఫలితాల్లో ఎస్.హర్షిత్ వర్మ 984, డి.తేజశ్రీ 731, ఎంవి శ్యామ్ వర్ధన్ 663, ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్)లో డి.సుశీల 928, జి.దివ్యజ్యోతి 894, సిఇసిలో కె.హరి, డి.మణికంఠ, పి.పృధ్వీ అత్యధిక మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) ఫలితాల్లో జి.దీక్షితామణి 430, ఎస్.లావణ్య 429, ఎస్.నవ్యశ్రీ 428, సిఇసిలో సిహెచ్ ఎన్ఎస్ఎస్.శ్వేత 346, ఎస్.దుర్గా లాస్య 346 అత్యధిక మార్కులు సాధించారు. స్థానిక కళాశాలలో అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కళాశాల అధ్యక్షులు కెకె.విశ్వనాథరాజు, గవర్నింగ్ బాడీ సభ్యులు దెందుకూరి గణపతిరాజు, కునాధరాజు మురళీకృష్ణంరాజు, డాక్టర్ గాదిరాజు కృష్ణంరాజు(బాబు), చేకూరి రాజశేఖర్ రాజు, కళాశాల ప్రిన్సిపల్ వేటుకూరి పద్మావతి, కళాశాల అధ్యాపక సిబ్బంది విద్యార్థులను అభినందించారు .

60 ఏళ్లు దాటిన వారికి కాల్షియం లోపం

పౌష్టికాహారం తీసుకుని క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి

హైదరాబాద్ స్టార్ హాస్పిటల్ సీనియర్ ఆర్థోపెటిక్ సర్జన్ శశికాంత్

భీమవరం : డిఎన్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డిఎన్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ స్టార్ హాస్పిటల్ సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జి.శశికాంత్ వైద్య సేవలు అందజేశారు. సుమారు 60 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నారన్నారు. 60 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ కాల్షియం లోపించి ఎముకలు బలహీనడతాయన్నారు. ఈ సమస్యకు తగిన పౌష్టికాహారం తీసుకొని ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. తాను ప్రతీ నెలా మొదటి, మూడవ గురువారాలలో భీమవరంలోని రాధాకృష్ణ నేత్రాలయంలో అందుబాటులో ఉంటానని తెలిపారు. అవసరమైన వారు ఈ నంబర్ 8500006770ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎన్‌ఆర్ కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణంరాజు, గవర్నింగ్ బాడీ మెంబర్స్ దత్తాత్రేయ వర్మ, పి.రామకృష్ణంరాజు, ఎ.సురేంద్ర, ప్రిన్సిపల్ జి.మోజస్, కృష్ణమోహన్, వాకర్స్ జిల్లా గవర్నర్ గుంటూరు రామరాజు, ట్రెజరర్ సీతారామరాజు, కనగర్ల విజయ రామకృష్ణ, చీఫ్ ఎడిటర్ డాక్టర్ ఎస్ఎస్ఎన్.రాజు, జాలీ వాకర్ అప్పలరాజు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్ పాల్గొన్నారు.

లయన్స్ సేవలు స్ఫూర్తిదాయకం

సామాజిక కార్యకర్త కీర్తన

తాడేపల్లిగూడెం: విద్యార్థి దశనుంచి కేన్సర్‌పై అవగాహన కల్పించాలని, ఆదిశగా పయనిస్తున్న అంతర్జాతీయ లయన్స్ సేవలు స్ఫూర్తిదాయకమని సామాజిక కార్యకర్త కీర్తన పేర్కొన్నారు. స్థానిక బాలికల పాఠశాలలో స్మైల్ డెంటల్ హాస్పటల్ అధినేత లయన్ ఎస్తేర్ కమల ఏర్పాటు చేసిన కేన్సర్ ఎవెర్నస్ క్యాంప్‌ని గురువారం పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఏర్పాటు చేసిన అవగాహనా తరగతులలో బాలికలకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమల మాట్లాడుతూ కేన్సర్ టెస్ట్ క్యాంప్‌లు మహిళలకి ఎంతగానో ఉపయోగ పడతున్నాయన్నారు. అమ్రాన్ బ్యాటరీస్ శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, బ్లడ్ డోనర్ మోజెస్ విలియమ్స్ సహకారంతో కేన్సర్ రహిత శానిటరీ ప్యాడ్స్, స్నాక్స్ బాలికలకు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణని డైమండ్స్ లయన్స్ తరుపున సన్మానించి జ్ఞాపికను అందజేశారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్‌గా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తామని ప్రకటించారు.

ప్రభుత్వ కళాశాలలో బైపిసి, ఎంపిహెచ్‌డబ్ల్యు గ్రూపులు ప్రారంభం

ఆకివీడు : మండలంలోని దుంపగడప ఆంధ్ర కేసరి ప్రకాశం శతజయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బైపిసి గ్రూపును ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీనివాసరావు, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాకర్ల రాజరాజేశ్వరిలు తెలిపారు. కళాశాలలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలిపారు. కళాశాల ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిందని, ఇప్పటి వరకు సిఇసి, హెచ్ఇసి, ఎంఇసి, ఎంపిసి గ్రూపులు నడుస్తున్నాయని తెలిపారు. ఈ సంవత్సరం నుంచి బైపిసితో పాటు ఎంపిహెచ్‌డబ్ల్యు(మహిళ) ఒకేషనల్ గ్రూపును కూడా ప్రారంభిస్తున్నామన్నారు. 2025- 2026 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించామని తెలియజేశారు.

స్వచ్ఛమైన తాగునీరందిస్తాం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు


ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్

కాళ్ల : ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. ఏలూరుపాడులో రూ.20 లక్షలతో నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, ఎంపిడిఒ జి.స్వాతి, ఎంపిటిసి చిన్నపరపు రాంబాబు, ఆర్డబ్ల్యుఎస్ డిఇ టి.శ్రీనివాసరావు, ఎఇ ఫణి, గ్రామ కార్యదర్శి ఎస్.అరుణ దేవి, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ పాల్గొన్నారు. ఏలూరుపాడు హైస్కూల్లో విద్యార్థులకు షటిల్ ఆడేందుకు మూడు కోర్టులను దాత దాట్ల శ్రీనివాసరాజు(స్కాట్లాండ్ వాసు) రూ.50 వేలతో ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచి భూపతి రాజు రూ.25 వేలతో వివిధ మొక్కలను ఏర్పాటు చేశారు.

'ఎంఆర్‌కె హైస్కూల్ సమస్యలు పరిష్కరించండి'

వీరవాసరం : వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నెలకొన్న సమస్యలను విద్యశాఖ అధికారులు వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని బిజెపి మండల శాఖ డిమాండ్ చేసింది. హై స్కూల్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేండ్ర దివాకర్ బృందం గురువారం పరిశీలించారు. హై స్కూల్‌కు కమిటీ ఉన్న దానిని సక్రమంగా నిర్వహించడంలో ప్రధానోపాధ్యాయుడు జుత్తిగా శ్రీనివాస్‌కు కమిటీ మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని దివాకర్ అన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి వీరవాసరం హై స్కూల్ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

25లోపు ఇకెవైసి చేయించుకోవాలి

ఆచంట : ఇకెవైసి పెండింగ్ రేషన్ లబ్ధిదారులు అందరూ విధిగా ఆయా రేషన్ డిపోల వద్దకు వెళ్లి ఇకెవైసి చేయించుకోవాలని ఆచంట తహశీల్దార్ జి.కనకరాజు గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ఆయా రేషన్ డిపోల వారీగా ఇకెవైసి పెండింగ్ జాబితాలు రేషన్ డిపోలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 25వ తేదీ నాటికి ఇకెవైసి పూర్తి చేయించుకోవాలని, లేనిపక్షంలో మే నెల నుంచి అందవలసిన రేషన్ సరుకులు నిలిపివేయబడతాయని తెలిపారు.